సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 12 । జూలై । 2024



## కరెంటు బిల్లు..

కరెంటు బిల్లు కట్టేందుకు పాత యాప్‌లు పనికిరావు. కొత్త యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. - 8లో



## ఇసుక అక్రమ తరలింపుపై..

మడపాంలో ఇసుక అక్రమ తరలింపుపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అధికారులను పరిశీలనకు పంపించారు. - 8లో

## ఎం.తోటూరులో సామూహిక అక్షరాభ్యాసం

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి తోటూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. నూతనంగా బడిలో చేర్పించే వారికి ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి సుహాష్ చంద్ ఆధ్వర్యంలో సరస్వతీదేవి చిత్రపటం ముందు శాస్త్రోక్తంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

## న్యూస్‌రీల్

### డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసేందుకు గడువు పెంచినట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శ్రీకాకుళం 80 ఫీట్ రోడ్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు ఈనెల 21 వ తేదీ నుంచి గిరిజన భవన్ లో (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం వెనుక) ప్రారంభిస్తామని, వివరాలకు 7382975679, 9295653489, 8332852106 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### పాలిటెక్నిక్ తుది విడత కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో పాలీసెట్-2024 వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన గురువారం ప్రారంభమైంది. మొదటి విడత పాలీసెట్‌లో ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నారు. గురువారం నుంచి శనివారం వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. మొదటి రోజు 35 మంది హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఆప్షన్ల నమోదు ఈ నెల 14వ తేదీలోపు చేసుకోవాల్సి ఉంటుంది. 16వ తేదీన సీట్లు అలాట్ చేస్తారు. 18 నుంచి 20వ తేదీ మధ్య సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాలి. మొదటి విడతలో సీట్లు వచ్చిన విద్యార్థులు సైతం రెండో విడతలో కళాశాలలు, బ్రాంచ్‌లు మార్చుకునే అవకాశం లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలు 10 ఉండగా, 2674 సీట్లు ఉన్నాయి. 1427 ప్రవేశాలు జరిగాయి. 1247 సీట్లు ఖాళీలు ఉన్నాయి. కౌన్సెలింగ్ ప్రక్రియను పిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

### తీరంలో మాక్‌డ్రిల్



సాగర్ కవచ్ గస్తీలో మాక్‌డ్రిల్

గార: అక్రమ చొరబాట్లను నిరోధించేందుకు మెరైన్, సివిల్ పోలీస్, కోస్టుగార్డులు మాక్‌డ్రిల్ నిర్వహించారని కళింగపట్నం మెరైన్ సీఐ నారీమణి తెలిపారు. బుధ, గురువారాల్లో జిల్లా తీర ప్రాంతమంతటా గస్తీ నిర్వహించారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా గురువారం ముగ్గురు వ్యక్తులు డమ్మీ ఆర్డీఎక్స్‌తో ఆమదాలవలస రైలులో దిగి, రోడ్డు మార్గాన శ్రీకాకుళం రూరల్ మండలంలోని తండ్యాలపేట సమీపంలో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వద్ద బైక్‌లపై వస్తుండగా వారిని పట్టుకుని అవగాహన కల్పించారు. ప్రజల్లో అవగాహన, యంత్రాంగం సమాయత్తం వంటి పరిస్థితులు అంచనా వేసేందుకు ఈ డ్రిల్ జరిగిందన్నారు. సాగర్ కవచ్ పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



# బాబు.. ఇది తగునా..

# వందనం ఒక్కరికేనా!

నిన్న ఇసుక.. నేడు తల్లికి వందనం.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల విషయంలో చంద్రబాబు ఒక్కొక్కటిగా మాట తప్పుతున్నారు. మడమ తిప్పుతున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే ఒక ఇంట్లో స్కూలుకు వెళ్లే పిల్లలు ఎంతమంది ఉంటే.. అంతమందికీ ఏటా రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం కింద ఇస్తామని ఇచ్చిన హామీకి చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని ప్రభుత్వం జారీ చేసిన జీవో చూసినవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ జీవోలో తల్లికి రూ.15 వేలు ఇస్తామని పేర్కొన్నారే తప్ప ఇంట్లో ఉన్న స్కూలుకు వెళ్లే పిల్లలందరికీ ఇస్తామన్న అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. దాంతో తల్లిదండ్రులు ఇదేమిటి చంద్రబాబు.. అని ప్రశ్నిస్తున్నారు. ఇదే కాదు ఉచిత ఇసుక విషయంలోనూ ఇదే తీరు కనబర్చారు. ఉచితం అని హామీ ఇచ్చి.. తీరా ఇప్పుడు టన్నుకు రేటు కట్టి విక్రయిస్తున్నారు. హామీలు ఇవ్వడం.. ఎన్నికల్లో గెలిచాక మాట తప్పడం.. దబాయించడం చంద్రబాబుకు అలవాటేనని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

### ఎన్నికలకు ముందు..

చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తాం. ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తాను. ఇద్దరా, ముగ్గురా, నలుగురా అన్న నిబంధన లేదు. పిల్లల్ని బడికి పంపిస్తే చాలు తల్లుల ఖాతాలో డబ్బులు వేస్తాను. ఇద్దరుంటే రూ. 30వేలు, ముగ్గురుంటే రూ. 45వేలు, నలుగురు ఉంటే రూ.60వేలు ఇస్తాను.

- శ్రీకాకుళం మున్సిపల్ మైదానంలో ఎన్నికలకు ముందు ఏప్రిల్ 24న నిర్వహించిన మహిళా సభలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది.




టీడీపీ మేనిఫెస్టోలో తల్లికి వందనం ప్రస్తావన

- స్కూలు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ. 15వేలు చొప్పున ఇస్తానని హామీ
- తాజాగా తల్లికి వందనం జీఓ జారీలో కిరికిరి
- తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తామని మార్గదర్శకాలు
- దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారే అర్హులని ఆంక్షలు
- ఆశతో ఎదురు చూసిన వారికి షాక్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

తల్లికి వందనం పేరిట వంచన జరుగుతోందా..? ఉచిత ఇసుక పథకం లాగానే ఇది కూడా ప్రకటన ఒకటి, అమలు మరొకటిలా మారనుందా..? పరిస్థితులు చూస్తుంటే ఔననే అనిపిస్తోంది.

సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ ఎన్నికల ప్రచారాల్లో తల్లికి వందనం పథకాన్ని ఊదరగొట్టారు. ఒక ఇంటిలో ఎంత మంది చదువుకుంటున్న పిల్లలు ఉంటే.. అంతమందికీ నగదు ఇస్తామని చెప్పారు. చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్ ఫొటో పెట్టి ముద్రించిన కర పత్రికలు, క్యాలెండర్లను ఇంటింటికీ పంచారు. మేనిఫెస్టోలోనూ తాటికాయంత అక్షరాలతో ముద్రించారు. ఇన్ని చేశాక.. జనమంతా ఓట్లు వేశాక.. పథకం అమలు చేయాల్సిన సమయం వచ్చాక.. టీడీపీ నాయకులు కొర్రీలు పెడుతున్నారు. ఒకరికి మాత్రమే తల్లికి వందనం అమలు చేస్తామన్నట్టుగా చెబుతున్నారు.

వాస్తవానికి చంద్రబాబు హామీ ప్రకారం.. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,54,892 మందికి, ఇంటర్ మీడియట్ చదువుతున్న 42,037 మందికి రూ.15 వేలు చొప్పున సాయం చేయాల్సి ఉంది. కానీ ఇది జరిగేట్టు కనిపించడం లేదు. అమ్మ ఒడి పేరును మార్చినంత సులువుగా ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కూడా మార్చేసే ప్రయత్నంలో ఉన్నారు. బుధవారం విడుదల చేసిన జీఓలో ఈచ్ మదర్‌కి రూ. 15 వేలు ఇస్తామంటూ మార్గదర్శకాలు జారీ చేశారు. దానికి బీపీఎల్(దారిద్ర్య రేఖకు దిగువన )లోపు ఉన్న వారికే అని ఆంక్షలు కూడా పెట్టారు. చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తారని ఆశపడ్డ తల్లులంతా ఇప్పుడు నిరాశకు గురవుతున్నారు. ఈ కొర్రీలు, ఆంక్షలతో ప్రయోజనం పొందాల్సిన 2,96,929 మందిలో సగం మందికి కూడా తల్లికి వందనం అందే పరిస్థితి లేదు.

**ముందు ఇసుక.. ఇప్పుడు తల్లికి వందనం..**

ఉచిత ఇసుక అని ఆకాశం బద్దలయ్యేలా ప్రచారం చేసిన టీడీపీ.. ఇప్పుడు టన్ను ఇసుకను రూ.340 చొప్పున బహిరంగంగా విక్రయిస్తోంది. గతం కంటే ఎక్కువ ధరకు ట్రాక్టర్ ఇసుక కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు టీడీపీ నాయకులు చెలరేగిపోయి ఎక్కడికక్కడ వంశధార, నాగావళిలో అనధికారికంగా రీచ్‌లు ఏర్పాటు చేసుకుని, నచ్చినంత ధరకు అమ్ముకుంటున్నారు. ఇప్పుడు తల్లికి వందనం పథకం అమలు విషయంలోనూ అదే ద్వంద్వ వైఖరి అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇంట్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో చాలా మంది ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించారు. ఇప్పుడొక్కసారి తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో ప్రైవేటు స్కూల్స్‌కు ఫీజులు చెల్లించడం ఎలా అని వారంతా లబోదిబోమంటున్నారు. వాస్తవానికి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లులకు చెల్లింపులు చేయాలి. ప్రభుత్వమిచ్చే సాయానికి కొంతకలిపి ప్రైవేటు విద్యా సంస్థలకు ఫీజులు చెల్లిస్తారు. కానీ, విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెల కావస్తున్నా మార్గదర్శకాలు, రకరకాల కొర్రీలు, ఆంక్షలు పెట్టి తాత్సారం చేస్తూ వస్తుండటంతో ఆశగా ఎదురు చూస్తున్న పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

### మాటమార్చితే ఎలా..



నాకు ఇద్దరు పిల్లలు. మా పిల్లల్ని ప్రైవేటు స్కూల్‌లో చేర్చాం. వారికి ఫీజులు కట్టాలి. మీరు ఇస్తామన్న తల్లికి వందనం డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం. నాతోపాటు పిల్లలను బడికి పంపుతున్న తల్లులంతా పిల్లలందరికీ చెరో రూ.15వేలు ఇస్తారని అనుకున్నాం. మాఆశలపై నీళ్లు చల్లవద్దు. ఇచ్చిన హామీ నెరవేర్చాల్సిందే.

– కైబాద సుజాత, టీపీ వలస, పోలాకి మండలం

### ఇద్దరు పిల్లలకు ఇవ్వాలి



మాకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. ఎన్నికల సమయంలో ఇంట్లో స్కూలుకు వెళ్లే పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఒక్కరికే ఇస్తారని అంటున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేరిస్తే మాకు మేలు జరుగుతుంది. మా ఇద్దరు పిల్లలకూ పథకం వర్తించాలి.

– కోరాడ నిరూష, గొల్లమాకన్నపల్లి గ్రామం, పలాస మండలం



ప్రభుత్వం విడుదలజేసిన జీవో

### ప్రభుత్వంలోకి వచ్చాక..

తల్లికి వందనం పథకం కోసం ఓ జీఓ జారీ చేస్తూ.. అందులో ప్రతి తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తా నని పేర్కొన్నారు. ఇంట్లో చదువుకున్న ప్రతి విద్యార్థికి ఇవ్వాల్సింది పోయి ప్రతి తల్లికి రూ.15వేలు ఇస్తానని ప్రస్తావించారు. దానికి ఆధార్ కార్డు ఉండాలని, బీపీఎల్(దారిద్ర్య రేఖకు దిగువన) ఉన్న వారికే మాత్రమే పథకం వర్తిస్తుందని షరతులు విధించారు.

### రూ.30వేలు రావాలి



నాకు ఇద్దరు కుమార్తెలు. వారు టెక్కలిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం అనే పథకంలో ఇంట్లో స్కూలుకు వెళ్లే పిల్లలందరికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున వేస్తామని చెప్పారు. ఈ పథకం ద్వారా నాకు రూ.30వేలు అందాలి. ఆ డబ్బులు వస్తే పాఠశాల ఫీజులు కట్టేందు ఎంతో ఉపయోగపడతాయి. ఇద్దరు పిల్లలకూ పథకం డబ్బులు రావాలి. – ధర్మాన దీపిక, టెక్కలి

### మాట నిలబెట్టుకోవాలి..



మాకు ఇద్దరు ఆడపిల్లలు. వీరిని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. ఒకరు 5వ తరగతి, మరొకరు 7వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఇద్దరికీ నగదు వస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. మా ఇద్దరు పిల్లలకు రూ.30వేలు వస్తుందని ఆశ పడ్డాను. ఇప్పుడేమో ఒక్కరికే అంటున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– నవిరి చంద్రకళ, చిట్టివలస, ఆమదాలవలస మండలం

## 'సరైన సమయంలో గర్భధారణతో తల్లికి మేలు'



చెక్కు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు, బిడ్డకు మధ్య అంతరం తల్లీబిడ్డకు మంచిదని ఆ దిశగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వైద్యం, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమన్నారు. జిల్లాలో కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్సలు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. కుటుంబ నియంత్రణ, శస్త్రచికిత్సలు ప్రోత్సహించడంలో ఉత్తమ సేవలు అందించిన వారికి నగదు పారితోషికం ఉంటుందన్నారు. అనంతరం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స లబ్ధిదారునికి రూ.5వేలు చెక్కును మీనాక్షి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీదేవి, డీపీఎంఓ డాక్టర్ జీవీ లక్ష్మి, డాక్టర్ సుజాత తదితరులు ఉన్నారు.

## పాతపట్నం సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పాతపట్నం సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

పాతపట్నం: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. పాతపట్నం సీహెచ్‌సీని గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రోగుల వార్డులు, ప్రస్తుత వార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ పనితీరు, డయారియా కేసుల వివరాలు, రోగులకు అందుతున్న సేవలను, ఓపీ, ఇన్ పేషెంట్ వివరాలను వైద్యురాలు అనితను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదులు, వంట పాత్రలను పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి తెలియజేశారు. ఆయనతో తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ రామ్, ఏపీఓ సురేష్, ఏపీఎం మణిరత్నం, ఎంఈఓలు శ్రీధర్, తిరుమలరావులు, ఆర్ఐ భువన్‌కుమార్, ఈఓపీఆర్డీ కృష్ణా రావు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ మెరిట్ లిస్ట్ విడుదల



ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ మెరిట్ లిస్టును గురువారం అధికారులు విడుదల చేశారు. 10వ తరగతి మార్కులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెయిటేజ్, ప్రత్యేక రిజర్వేషన్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా రాష్ట్రంలో విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపుల పాయ, ఒంగోలు క్యాంపస్‌లను ఎంపిక చేసుకున్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి మహిళలకు 685, పురుషులకు 325, ప్రత్యేక కేటగిరీల్లో 100 మందికి ప్రవేశాలు కల్పించారు. మొత్తం 1100 సీట్లకు 1110 సీట్లు కేటాయించారు. 10 సీట్లు అదనంగా కేటాయించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 915, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు 95, తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు 12, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఒకటి, ఇతర ప్రత్యేక కేటగిరీలకు మిగిలిన సీట్లు కేటాయించారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఎస్ఎంపురం క్యాంపస్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. విద్యార్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి నూజివీడుకు 160 మంది, ఇడుపులపాయకు ఒకరు, ఒంగోలుకు 112, శ్రీకాకుళానికి 225 మంది ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఆర్‌జీయూకేటీ విద్యాసంస్థకు 498 మంది ఎంపికయ్యారు. 12.33 శాతం విద్యార్థులు ఎంపిక కాగా, 26 జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు ఎక్కువ మంది ఎంపిక కావటం గమనార్హం.



### నరసింహావతారంలో..

జగన్నాథ రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి నరసింహావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక వేంకటేశ్వరాలయం, పెద్దపేట రామాలయంలో నరసింహావతారంలో ఉన్న జగన్నాథ స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు.

నరసన్నపేట



### వానలు కురవాలి దేవుడా..

వానలు కురవాలని, పంటలు పండాలని కోరుతూ పెద్దపద్మాపురం, జోడూరు గ్రామాల్లో గ్రామ దేవతలకు గురువారం పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ముర్రాటలతో జోడూరు గ్రామంలో చల్లదనం చేశారు. పెద్దపద్మాపురం గ్రామ ప్రజలంతా కలసి తోటలో వెలసిన గాంధమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.

– మెళియాపుట్టి




### ముగ్గు సందేశం

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగవల్లిక ఏర్పాటు చేశారు. జనాభా పెరుగుదల అంత మంచిది కాదని సందేశమిచ్చారు.

– సారవకోట

## క్లుప్తంగా

### ఆదిత్యుని సన్నిధిలో శ్రీరామానంద భారతి స్వామీజీ


ఆదిత్యుని సన్నిధిలో శ్రీరామానంద భారతి స్వామీజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం శ్రీమౌనానంద తపోవనం శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి శ్రీరామానంద భారతి స్వామీజీ గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌లు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రత్యేక గోత్రనామాల అర్చనల తర్వాత వేదాశీర్వచనాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్

నరసన్నపేట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను దేవాది, చెన్నాపురంల వద్ద ఎస్ఈబీ అధికారులు గురువారం సీజ్ చేశారు. వంశధార నది నుంచి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా దేవాది, చెన్నాపురంల మీదుగా నరసన్నపేటకు తీసుకెళ్తున్నట్లు గమనించి దేవాది, చెన్నాపురంల వద్ద తనిఖీలు చేశామని ఎస్ఈబీ సీఐ సతీష్‌కుమార్‌లు తెలిపారు. దీంట్లో రెండు ట్రాక్టర్లను గుర్తించామని సీజ్ చేసి నరసన్నపేట పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అయితే బుధవారం పబ్లిక్‌గా పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు నిమ్మాడకు తరలించినా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు మండిపడ్డారు.

### కోర్టు ఆవరణలో భార్యపై భర్త దాడి


స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు శోభారాణి

టెక్కలి రూరల్: టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో గురువారం ఓ వ్యక్తి తన భార్యపై దాడికి తెగబడ్డాడు. మండలంలోని అయోధ్యాపురం పంచాయతీ పరిధి కంట్రగడ గ్రామానికి చెందిన అరంగి శోభారాణి, నరసన్నపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన చలపతిరావులు భార్యాభర్తలు. వీరి మధ్య మనస్పర్థలు ఉండడంతో శోభారాణి తన భర్తపై కేసు వేశారు. ఆ కేసు వాయిదా కోసం గురువారం ఇద్దరూ కోర్టుకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం ముదిరిపోవడంతో భర్త చలపతిరావు భార్య శోభారాణిపై దాడి చేశారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. శోభారాణి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నర్సింగరావు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

### కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఏ సంఘం ప్రతినిధులు


కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఏ సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రతినిధులు గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూ పదోన్నతుల్లో వీఆర్‌ఓ, సబార్డినేట్, వాచ్‌మెన్‌లకు నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వై.అప్పలస్వామి, యజ్జల రామారావు, మెండ రాజారావు తదితరులు ఉన్నారు.

### ఇంటిలో మూడు తులాల బంగారం చోరీ

టెక్కలి రూరల్: స్థానిక కొత్తమ్మ తల్లి వీధికి చెందిన కోరు మోహన్ రావు అనే రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగినట్లు గురువారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు లు తెలిపిన వివరాలు ప్రకారం.. మోహనరావు అనకాపల్లి ఉన్న తన కుమారుడిని చూసేందు కు కొద్దిరోజుల కిందట వెళ్లి గురువారం తిరిగి వచ్చారు. అయితే ఆయన వచ్చే సమయానికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా ఇంటిలో సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న మూడు తులాల బంగారంతో పాటు 400 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ నర్సింగరావు కేసు నమోదు చేశారు. అనంతరం క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించింది.

# కరెంటు బిల్లు..
# ఆ యాప్‌లు చెల్లవు

- విద్యుత్ బిల్లుల చెల్లింపులో కొత్త నిబంధనలు
- ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంలతో ఇక కుదరదు
- ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా బిల్లుల చెల్లింపులు

పాతపట్నం:

విద్యుత్ బిల్లుల చెల్లింపులో కీలకమైన మార్పులు జరిగాయి. డిజిటలైజ్ అయ్యాక చాలా మంది విద్యుత్ బిల్లులను ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐల ద్వారా నేరుగా కట్టేసేవారు. కానీ ఇప్పుడలా కుదరదు. యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఏపీఈపీడీసీఎల్ స్వస్తి పలికింది. ఇక నుంచి కేవలం ఏపీఈపీడీసీఎల్ వెబ్ సైట్, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ల ద్వారా మాత్రమే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీల ద్వారా చెల్లింపులకు నో చెప్పింది. ఇందుకోసం ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలని సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాలు జారీ చేశారు.

**కొత్త మార్గదర్శకాలు**

విద్యుత్ బిల్లులను చాలామంది వినియోగదారులు కౌంటర్లలో చెల్లిస్తారు. గ్రామాల్లో నెలకు ఒకసారి ఏపీఈపీడీసీఎల్‌కు సంబంధించిన సిబ్బంది వచ్చి కట్టించుకుంటున్నారు. మరి కొందరు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లలో చెల్లిస్తున్నారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలన్నీ వాటి నుంచే జరుగుతున్నాయి.




ముఖ్యంగా గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్‌ల నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

**పేమెంట్ సులభం**

సాధారణంగా యాప్‌ల ద్వారా బిల్లు చెల్లించడం చాలా సులువుగా ఉండడంతో చాలా మంది వినియోగదారులకు ఆ విధానంలో కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ బిల్లుల చెల్లింపు విషయంలో కూడా సులభమైన పేమెంట్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. ఇప్పటికే వీటిని ప్రజలకు చేరువ చేసింది.

Eastern power Mobile App

**డౌన్‌లోడ్ చేసుకునే విధానం**

- ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించాలనుకునే వినియోగదారులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దానికి అవసరమైన అనుమతులు ఇవ్వాలి. దీని ద్వారా చాలా సులభంగా బిల్లులు కట్టవచ్చు.
- వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించాలనుకునే వినియోగదారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఈస్టర్న్‌పవర్.కమ్ ద్వారా పేమెంట్ చేయవచ్చు.
- యాప్, వెబ్‌సైట్‌లలో బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లతో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్లను కూడా ఉపయోగించుకోవచ్చు.

**చాలా సులువు**



ఈస్టర్న్ పవర్ యాప్‌ను, వెబ్‌సైట్‌ల ద్వారా వినియోగదారులు చాలా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఈ మేరకు పాతపట్నంతో పాటు, టెక్కలి డివిజన్, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు విద్యుత్ శాఖ ఉద్యోగులు ద్వారా అధికారులు అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీఐ ఆదేశాలను అనుసరించి సంస్థ ఈ విధమైన చర్యలు చేపట్టింది.

– జి.ప్రసాదరావు, డీఈఈ, విద్యుత్‌శాఖ, పాతపట్నం

### ఆత్మీయ పలకరింపు



తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మీయంగా పలకరిస్తూ పార్టీని బలపరిచేందుకు కృషి చేయాలని సూచించారని శ్రీకాంత్ తెలిపారు.

– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

### బైక్ చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలి వద్ద ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు వాహన యజమాని కల్యాణ్ దాస్ గురువారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. విజయవాడకు చెందిన దుస్తుల వ్యాపారి కల్యాణ్‌దాస్ ఇక్కడ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి బైక్ చోరీ కాగా, ఎప్పటికీ లభ్యం కాక పోవటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## ఇసుక అక్రమ తరలింపుపై కలెక్టర్ సీరియస్

నరసన్నపేట: మండలంలో ఇసుక అక్రమ తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరూ అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడవద్దని నరసన్నపేట తహసీల్దార్ కనకారావు హెచ్చరించారు. 'మంత్రి అచ్చెన్న పేరిట ఇసుక అక్రమ రవాణా' అన్న శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ స్పందించారు. వెంటనే ఇసుక అక్రమ తవ్వకాలను అదుపు చేయాలని, వంశధార లోనికి వాహనాలు వెళ్లకుండా మార్గాలను క్లోజ్ చేయాలని ఆదేశించారు. దీంతో నరసన్నపేట తహసీల్దార్ కనకారావు, ఏఎస్ఐ అసిరినాయుడు, వీఆర్వోలు అప్పలనాయుడు తదితరులు బుచ్చిపేట, మడపాం, గోపాలపెంట ర్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ర్యాంపులను క్లోజ్ చేస్తున్నామని తోవ లేకుండా ట్రెంచ్‌లు తీస్తున్నామని అన్నారు. మరింత నిఘా పెడుతున్నామని, వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. అలాగే బుచ్చిపేట వద్ద ఉన్న ఇసుక నిల్వలను గుర్తించామని వాటిని సీజ్ చేస్తున్నామని తెలిపారు.


బుచ్చిపేట ఇసుక ర్యాంపు వద్ద నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

## 'ఇసుకకు అవస్థలు తప్పడం లేదు'


టెక్కలి లో ఇసుక కోసం కిలోమీటర్ల మేర బారులు తీరిన ట్రాక్టర్లు

టెక్కలి: నూతన ఇసుక విధానంతో అవస్థలు తప్పడం లేదు. టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద గత మూడు రోజులుగా అవస్థలు పడుతున్న ట్రాక్టర్ యజమానులకు గురువారం సైతం అవే ఇబ్బందులు ఎదురయ్యాయి. డబ్బులు చెల్లించి మరీ అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్యాన పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యానవన పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. ఎస్ఎంపురంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయల సాగు, ఉద్యాన వన పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు ముందుగా సాగుకు ముందు నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. బంతి, టమాటా, వంగ, బొప్పాయి సాగు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు మంచి ఆదాయం వస్తుందని అన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ చేపల పెంపకం, డెయిరీ నిర్వహణ వంటివి సైతం మంచి ఆదాయ మార్గాలని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ వరి సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. విత్తిన 15 రోజుల తర్వాత నారు మడిలో కలుపు నివారణకు నామిని గోల్డ్ పిచికారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల సందేహాలు నివృత్తి చేశారు.


రైతులకు వ్యవసాయ మెలకువలు వెల్లడిస్తున్న శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బూర్జ: మండలంలో గల సింగన్నపాలేం, ఉప్పినివలస గ్రామాల మధ్య పాలకొండ ప్రధాన రహదారిపై గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చోడవరపు భార్గవకుమార్(27) అనే యువకుడు మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అయ్యవారిపేట గ్రామానికి చెందిన భార్గవకుమార్ తెల్లవారు జామున విధులకు హాజరయ్యేందుకు అయ్యవారిపేట నుంచి పైడిభీమవరం గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. సింగన్నపాలేం, ఉప్పినివలస గ్రా మాల మధ్య పాలకొండ ప్రధాన రహదారిపై ఆమదాలవలస వైపు నుంచి పాలకొండ వైపు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనం వచ్చి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ యువకుడు పైడిభీమవరంలోని రెడ్డీస్ కంపెనీలో అప్రెంటీస్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి తండ్రి చోడవరపు లక్ష్మునాయుడు, తల్లి సూర్యం ఉన్నారు. మృతుడి తండ్రి లక్ష్మునాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.


భార్గవకుమార్

## పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న కేఎస్‌సీ బోస్

శ్రీకాకుళం అర్బన్: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐబీడీపీఏ (ఆలిండియా బీఎస్ఎన్ఎల్–డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్) రాష్ట్ర కార్యదర్శి కేఎస్‌సీ బోస్ అన్నారు. అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా 4వ మహాసభలు శ్రీకాకుళంలోని తిలక్‌నగర్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి కె.గోపాలరావు నివేదికను సభలో ప్రవేశపెట్టారు. సభ్యులు దీనిపై చర్చించి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే సభ్యుల నుంచి కొన్ని ప్రతిపాదనలు, తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఏఐబీడీపీఏ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామారావు, ఎం.గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు, చరణ్, అధిక సంఖ్యలో పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 'అతి ప్రాచీన సాహిత్య కళ అవధానం'

శ్రీకాకుళం కల్చరల్: అతి ప్రాచీనమైన సాహిత్య కళ అవధాన ప్రక్రియ అని విశాఖలోని మౌనానంద తపోవన ఆశ్రమానికి చెందిన రామానంద భారతి స్వామి అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో వైజయంతి ఉత్సవ మండపంలో ద్విశతావధాన కళావిలాస కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీ ద్విశతావధాన సభలో పాల్గొని అనుగ్రహణ భాషణం చేశారు. సభాధ్యక్షులు పార్వతీపురం సూర్యపీఠాధిపతి వేమకోటి నరహరి శాస్త్రి మాట్లాడుతూ అవధాన ప్రక్రియలో పాల్గొన్న అవధాని అపర్ణ ఎంతో పాండిత్యం పొందిన వారని కొనియాడారు. అనంతరం బులుసు అపర్ణ అన్ని ప్రశ్నలకు పూరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమీషనర్ ఎస్.చంద్రశేఖర్, సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ పులంఖడం శ్రీనివాసరావు, బంకుపల్లి రమేశ శర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, కె.సురేష్, బంకుపల్లి శంకరం, వరలక్ష్మీ, పూజ, మల్లెమొగ్గల రాజు తదితరులు పాల్గొన్నారు.


సభలో అనుగ్రహ భాషణ చేస్తున్న రామానంద భారతి స్వామి

## 'వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి'

రణస్థలం: ఆదర్శ పాఠశాలలోని వసతి గృహాల్లో సరైన శుభ్రత పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలోని వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి గదిని చూసి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. డయేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు పాటించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య, ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఉన్నారు.


భోజన హాలును పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

## ఒకే పాఠశాలకు చెందిన 17మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 17మంది విద్యార్థులతో ఉపాధ్యాయులు

రణస్థలం: రణస్థలం ఆదర్శ పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి కె.శిరీష, బి.శ్రావణి, ఎ.పూర్ణిమ, ఎం.హేమవర్షిణి, వి.కిరణ్, సుఫియా షాహీన్, పి.జ్యోతిర్మయి, జి.యోగేశ్వరి, పి.తనూష, కె.జ్యోతి, ఎం.వనజాక్షి, సీహెచ్ నిరంజన్‌లతో కలిపి 12మంది, అలాగే శ్రీకాకుళంలో ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీకి బి.జ్యోత్స్న, సీహెచ్ కళ్యాణి, యు.భవానీలతో మొత్తం ముగ్గురు, అలాగే ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎన్.కీర్తన, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి సీహెచ్ ప్రమీల ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

## అండమాన్‌లో మత్స్యకార మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మత్స్యకార సంఘ ప్రతినిధుల ఆందోళన
- పోలీసుల లాఠీచార్జి

సోంపేట: అండమాన్ నికోబార్ దీవుల్లోని జీబీ పంత్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోంపేట మండలం ఇసుకలపాలెం గ్రామానికి చెందిన కోడ విమల (22) మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే ఆమె చనిపోయిందని ఆమె కుటుంబ సభ్యులు, అక్కడి ప్రవాసాంధ్రులు ఆందోళన చేశారు. ఈ ఆందోళనను నియంత్రించడానికి పోలీసులు లాఠీచార్జి సైతం చేయాల్సి వచ్చింది. ప్రవాసాంధ్రులు తెలిపిన వివరాల మేరకు.. ఇసుకలపాలెం గ్రామానికి చెందిన కోడా కృష్ణ, కోడ విమల దంపతులు వలస జీవులుగా అండమాన్‌లో బతుకుతున్నారు. వీరికి ఏడాదిన్నర వయసు గల కుమారుడు ఉన్నాడు. జూలై 6న విమలకు జ్వరం వచ్చింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షిస్తుండగానే ఆమె మృతి చెందారు. అయితే వైద్యులు సకాలంలో స్పందించకపోవడం వల్లనే విమల మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఉదయం 8 గంటలకు ఆస్పత్రికి తీసుకువస్తే 1 గంట వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించలేదని, ఆలస్యం కారణంగా మృతి చెందిందన్నారు.

**మత్స్యకార సంఘ ప్రతినిధుల ఆందోళన..**

విమల మృతి చెందిన విషయం తెలియడంతో స్థానికంగా ఉన్న జిల్లాకు చెందిన మత్స్యకార కుటుంబాల సభ్యులు వందలాది మంది ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రవాసాంధ్రులకు సరైన వైద్యం అందజేయాలని కోరుతూ శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. శవ పంచనామా తెలుగు వైద్యుల సమక్షంలో చేయాలని నినాదాలు చేశారు. ఆస్పత్రి సిబ్బంది స్పందించక పోవడంతో 6వ తేదీ నుంచి నుంచి 10వ తేదీ వరకు మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద ఉంచి ధర్నా నిర్వహించారు. దీంతో వారి ఆందోళనను నియంత్రించడా నికి పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇందులో పలువురికి గాయాలయ్యాయి. దీంతో మత్స్యకార సంఘా ల ప్రతినిధులు ఆందోళన తీవ్రతరం చేశారు. గురువారం ఉదయం శ్రీకాకుళం ఎంపీ, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అండమాన్ ఎంపీ బిష్ణు పదురైతో మాట్లాడారు. బిష్ణుపదురై స్థానిక మత్స్య కారులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడేటప్పు డు హిందీ రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తెలుగు అర్థం అయ్యేలా వేరే వ్యక్తిని నియమించాలని వారు కోరారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, 2013లోనూ ఒకరు ఇలాగే మృతి చెందారని తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


అండమాన్‌లో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మత్స్యకార సంఘ ప్రతినిధులు
విమల (ఫైల్)

## అందరూ సెలవులోనే...

- టెక్కలి పోలీసులపై పనిభారం
- సెలవుల్లో ఉన్నతాధికారులు

టెక్కలి రూరల్:

డివిజన్ కేంద్రమైన టెక్కలి పోలీస్ స్టేషన్‌లో గత కొద్ది రోజులుగా ఉన్నత స్థాయి అధికారులు సెలవులో ఉన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ పోలీస్ స్టేషన్ నిత్యం రక రకాల కేసులతో బిజీబిజీగా ఉంటుంది. అయితే ఈ స్టేషన్ పరిధిలో ఉన్న అధికారులు గత కొద్ది రోజులుగా సెలవుల్లో ఉండటంతో రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఏఎస్ఐ నర్సింహమూర్తి ఒక్కరే కేసుల నమోదులో బిజీబిజీగా ఉండటంతో ఫిర్యాదుదారులు ఎక్కువ రోజులు స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. టెక్కలి సబ్‌డివిజన్ పరిధిలో గల టెక్కలి స్టేషన్‌లో ఉండాల్సిన అధికారుల్లో ఎస్ఐ లక్ష్మి కొద్ది రోజుల కిందట వీఆర్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. సీఐ పైడయ్య సైతం ఆరోగ్యం బాగోలేదని సెలవు పెట్టారు. అదేవిధంగా డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి సైతం గత రెండు రోజులుగా సెలవులో ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ–2 అంధవరపు వెంకటేశ్వరరావు సైతం ఒక కేసు విషయమై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో స్టేషన్ పరిధిలో ప్రస్తుతానికి నలుగురు ఏఎస్ఐలు, ఐదుగురు హెచ్‌సీలు, 21 మంది పీసీలు మాత్రమే స్టేషన్‌లో ఉన్నారు. ఇందులోనూ కొంతమంది ఏఎస్ఐలు, సిబ్బంది ఇతర ప్రాంతాలకు రెండు రోజులుగా వెళ్లినట్లు తెలిసింది. ఏఓబీకి కాస్త దూరంలో, అది కూడా హైవే పక్కన ఉన్న స్టేషన్‌లో ఉన్నతాధికారులు లేకపోవడంతో ఫిర్యాదుదారులు అవస్థలు పడుతున్నారు.